సాక్షి రంగారెడ్డి

సోమవారం । 7 । ఏప్రిల్ । 2025



వేసవి దుక్కులు.. లాభాలు

తొలకరి ప్రారంభానికి ముందే రైతులు పొలం పనులకు సమాయత్తం కావాలి. వేసవిని అనుకూలంగా మలుచుకోవాలి. 8లో ▸



భూమి దక్కదనే కక్షతోనే..

ఐదెకరాల పొలం తమకు దక్కదనే కక్షతో సుపారీ ఇచ్చి కారుతో ఢీకొట్టి దాయాదిని హత్య చేయించారు. 8లో ▸



గూబ గుయ్!

వాహనాల మోత దడ పుట్టిస్తోంది. అవసరం లేకున్నా మోగిస్తున్న హారన్‌లతో రహదారులు దద్దరిల్లిపోతున్నాయి. 8లో ▸

న్యూస్‌రీల్

'నీరా' కేంద్రాన్ని సందర్శించిన ఏపీ ఎక్సైజ్ అధికారులు



నీరా తయారీ విధానం గురించి అడిగి తెలుసుకుంటున్న శ్రీదేవి

కడ్తాల్: మండల పరిధిలోని ముద్వీన్ గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన 'నీరా' తయారీ కేంద్రాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్ డివిజన్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి, ఎక్సైజ్‌శాఖ అధికారులతో కలిసి ఆదివారం సందర్శించారు. గీత కార్మికులకు లాభాలు చేకూర్చేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన నీరా తయారీ విధానాన్ని పరిశీలించారు. చెట్టు నుంచి ఏ విధంగా సేకరిస్తున్నారు.. ఎంత మేర ఉత్పత్తి అవుతోంది.. నీరా నుంచి అదనపు ఉత్పత్తుల (బై ప్రొడక్ట్)ను ఎలా తయారు చేయాలి తదితర విషయాలను నీరా కేంద్రం శాస్త్రవేత్త సత్యంను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చరికొండ గ్రామంలో పర్యటించి తాటి చెట్ల నుంచి నీరా సేకరణ గురించి గీత కార్మికులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ బద్యానాథ్ చౌహన్, ఎస్ఐ అరుణ్‌కుమార్, ఈసీ బాబు తదితరలు పాల్గొన్నారు.

ఆలయ హుండీలో రద్దయిన రూ.2వేల నోట్ల కట్టలు



పహాడీషరీఫ్: ఆలయ హుండీలో రద్దయిన రూ.2వేల నోట్ల కట్టలు రెండు బయటపడ్డాయి. ఈ సంఘటన బాలాపూర్ మండలం మామిడిపల్లిలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామంలోని దాసాంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం శ్రీరామ నవమి సందర్భంగా కల్యాణోత్సవం అనంతరం గత ఏడాది కాలానికి సంబంధించి హుండీ లెక్కింపు కోసం ఆలయ కమిటీ సభ్యులు తెరిచారు. అందులో రద్దయిన రూ.2 వేల నోట్ల కట్టలు రెండు బయటపడ్డాయి. వాటిని లెక్కించగా రూ.2 లక్షలుగా తేలింది. దీనిని ఆర్‌బీఐ దృష్టికి తీసుకెళ్తామని నిర్వాహకులు తెలిపారు.

24న చుక్కా రామయ్య ప్రవేశ పరీక్ష

అనంతగిరి: ఐఐటీ చుక్కా రామయ్య ట్రస్ట్‌లో ఉచిత విద్య కోసం ఈ నెల 24న ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వెంకటరత్నం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాల్లో చదువుతున్న విద్యార్థులకు 5, 6, 7 తరగతుల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించే ఎంట్రెన్స్‌కు ఈ నెల 18వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 94404 83015, 96521 802819, 98495 85729, 94916 76672 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

స్నేహితుల దాడిలో పెయింటర్ మృతి



ఆకాశ్ సింగ్ (ఫైల్)

మల్కాజిగిరి: స్నేహితుడిపై దాడి చేయడంతో తీవ్ర గాయాలై చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ కథనం ప్రకారం.. మౌలాలికి చెందిన ఆకాశ్ సింగ్ (29) పెయింటర్. ఇదే ప్రాంతా నికి చెందిన ఇంతియాజ్, ఆకాశ్ ఇద్దరూ స్నేహితులు. వ్యక్తిగత కారణాలతో కొంతకాలంగా ఇద్దరూ దూరంగా ఉంటున్నారు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున ఇంతియాజ్ సోదరుడు షారూక్ ఇంటికి రాకపోవడంతో అతడికి ఫోన్ చేశాడు. స్పందించకపోవడంతో జెడ్‌టీసీ గ్రౌండ్స్ వద్దకు వెళ్లి చూసేసరికి ఆకాశ్ సింగ్ అతడి మరో స్నేహితుడు కిషన్, షారూక్ మద్యం తాగుతూ కనిపించారు. దీంతో ఆగ్రహించిన ఇంతియాజ్ అతడితో తిరగొద్దని మందలించాడు. మాటామాటా పెరిగి గొడవకు దారి తీసింది. ఇంతియాజ్ సిమెంట్ ఇటుకతో ఆకాశ్ తలపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో సోదరులిద్దరూ అక్కడి నుంచి పరారయ్యారు. ఘటనా స్థలంలో ఉన్న కిషన్.. విషయాన్ని ఆకాశ్ కుటుంబ సభ్యులకు చెప్పగా.. వెంటనే వారు అక్కడికి చేరుకుని చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆకాశ్ మృతి చెందాడు. మృతుడి సోదరుడు రాజేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కడ్తాల్: ఉత్సవమూర్తులకు భక్తితో వందనం



షాబాద్: కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు



ఆమనగల్లులో: భక్తుల కోలాటాలతో సీతారాముల ఊరేగింపు

❖ తిలకించి.. పులకించి

శ్రీరామనవమి వేడుకలను ఆదివారం జిల్లావాసులు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఆలయాలను శోభాయమానంగా అలంకరించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా ఆలయాలకు తీసుకొచ్చారు. పచ్చనిపందిళ్లు.. పూల తోరణాలు.. మేళతాళాలు.. ముత్యాల తలంబ్రాలు.. వేదపండితుల మంత్రోచ్చారణలతో సీతారాముల కల్యాణతంతును అంగరంగ వైభవంగా జరిపించారు. కల్యాణఘట్టాన్ని కనులారా వీక్షించిన భక్తులు పులకించిపోయారు. పలుచోట్ల అన్నదానాలు నిర్వహించారు. ఎక్కడ చూసినా పండుగ వాతావరణం కనిపించింది.



చేవెళ్ల: ముడిమ్యాలలో తాళిబొట్టు చూపిస్తున్న పూజారి

బిల్లులు రాక.. అప్పులు తీరక!

మాజీ సర్పంచ్‌ల అవస్థలు

- అభివృద్ధి పనులకు సొంత నిధులు
- అందినకాడికి అప్పులు తెచ్చి ఖర్చు
- అసలుకు మించి వడ్డీ చెల్లింపులు
- బిల్లుల కోసం ఎదురుచూపులు



కేశంపేటలోని ప్రాథమిక పాఠశాల భవన ప్రారంభోత్సవంలో సర్పంచ్ (ఫైల్)

కేశంపేట: గ్రామాలను అభివృద్ధి పరచాలనే లక్ష్యంతో కొందరు.. వారసత్వ రాజకీయాలతో మరికొందరు.. రాజకీయాలపై వ్యామోహంతో ఇంకొందరు వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకున్నారు.. సర్పంచులుగా ఉత్సాహంతో పోటీ చేశారు. ప్రభుత్వం నుంచి నిధులు రాకపోయినా ప్రజలకిచ్చిన మాట కోసం అభివృద్ధి పనులు చేపట్టారు. ఇందుకోసం సొంత నిధులు వెచ్చించారు. అవీ సరిపోక అప్పులు చేసి చేపట్టిన పనులు పూర్తి చేశారు. తీరా వాటికి సంబంధించిన బిల్లులు రాక.. చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక నానా తంటాలు పడుతున్నారు.

పదవీ కాలం ముగిసి ఏడాది దాటినా..

జిల్లాలోని 21 మండలాల్లో 531 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో ప్రభుత్వం నుంచి స్టేట్ ఫైనాన్స్, 15వ ఆర్థిక సంఘం నిధులు రావాల్సి ఉంది. వీటితో పాటు మన ఊరు మన బడి పథకంలో భాగంగా చేపట్టిన పనులకు సైతం బిల్లులు రావాల్సి ఉంది. ఈలోగా 2 ఫిబ్రవరి 2024తో పదవీ కాలం కాస్తా ముగిసింది. అప్పటి వరకు సర్పంచులుగా ఉన్నవారిని తప్పించి గ్రామాలకు ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించింది. పెండింగ్ బిల్లులు చెల్లించాలని, అప్పటి వరకు తమ పదవీ కాలం పొడిగించాలని విజ్ఞప్తి చేసినా వినిపించుకోలేదు. ఇటు పదవీ కాలం ముగిసి అటు పల్లెల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు చేసిన బిల్లులు రాక తలలు పట్టుకుంటున్నారు.

వడ్డీలు కట్టేందుకు మళ్లీ అప్పులు..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికలకు ఏడాది ఉందనగా టార్గెట్లు పెడుతూ అభివృద్ధి పనులు చేయించింది. గ్రామాల్లో పనులు చేస్తే తమను గ్రామస్తులు జీవితాంతం గుర్తుంచుకుంటారనే తపనతో అప్పట్లో సర్పంచులు అధిక వడ్డీలకు అప్పులు చేసి పనులు చేపట్టారు. తదనంతరం అసెంబ్లీ ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారిపోవడం జరిగిపోయాయి. ప్రభుత్వం మారిన కొద్ది నెలలకే సర్పంచుల పదవీ కాలం కూడా ముగిసింది. నిలిచిపోయిన బిల్లుల చెల్లింపులకు నేటికీ మోక్షం లభించడం లేదు. పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించకపోవడం.. కొత్త పాలకవర్గాలు ఏర్పాటు కాకపోవడంతో కొత్త ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులను మంజూరు చేయడం లేదు. బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతోంది. మాజీ సర్పంచులు తెచ్చిన అప్పులకు వడ్డీ చెల్లించేందుకు మళ్లీ అప్పులు చేయాల్సి వస్తోంది.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



గ్రామంలో చేసిన అభివృద్ధి పనులకు సుమారు రూ.90 లక్షల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. చెల్లింపులో ఇప్పటికే చాలా ఆలస్యం అయింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే బిల్లులు మంజూరు చేయాలి.

– తలసాని వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్, కేశంపేట

వడ్డీ కట్టేందుకు మళ్లీ అప్పు



గ్రామంలో రూ.42లక్షలు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టా. అప్పు చేసి ఆ మొత్తం వెచ్చించా. తెచ్చిన అప్పునకు వడ్డీ కట్టేందుకు మళ్లీ కొత్తగా అప్పు తీసుకుంటున్నాను. ప్రభుత్వం ఇప్పటికైనా బిల్లులు చెల్లిస్తే వడ్డీ చెల్లింపు తప్పుతుంది.

– తాండ్ర విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచ్, పాపిరెడ్డిగూడ

వినతులు.. ఆందోళనలు

పెండింగ్ బిల్లులను చెల్లించాలని కోరుతూ మాజీ సర్పంచులు అనేకమార్లు ప్రభుత్వ పెద్దలను కలిసి వినతిపత్రాలు అందించారు. అయినా బిల్లులు మంజూరు కాకపోవడంతో చలో అసెంబ్లీ, సచివాలయం ముట్టడి కార్యక్రమాలకు పిలుపునిచ్చారు. అయినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. ప్రభుత్వం నుంచి తమకు రావాల్సిన పెండింగ్ బిల్లులు వెంటనే మంజూరు చేసి తమను అప్పుల ఊబి నుంచి బయటపడేయాలని, పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలని మాజీ సర్పంచులు కోరుతున్నారు.

సంప్రదాయ విత్తనాన్ని సంరక్షించుకుందాం



'ఆరోగ్యానికి.. ఆహార భద్రతకు విత్తనం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

- వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి
- ముగిసిన విత్తన పండుగ

కడ్తాల్: కల్తీ విత్తనాల నిర్మూలన.. రైతుకే విత్తన హక్కు అంశాలకు చట్ట రూపం ఇచ్చి అమలు పరిచినప్పుడే దేశీ విత్తనాలను రక్షించుకోగలుగుతామని తెలంగాణ వ్యవసాయ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి అభిప్రాయపడ్డారు. మండల పరిధిలోని అన్మాస్‌పల్లిలో మూడు రోజులుగా కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్–భారత్ బీజ్ స్వరాజ్ మంచ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ తొలి విత్తన పండుగ ఆదివారంతో ముగిసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కోదండరెడ్డి మాట్లాడుతూ.. సంప్రదాయ విత్తనాలను సంరక్షించుకోవాలని పేర్కొన్నారు. విత్తన సంరక్షణలో మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలని, కూరగాయలు, ధాన్యాల విత్తనాలను భద్రపరుచుకుని పంచుకునే విధానాన్ని పునరుజ్జీవంప జేసుకోవాలని అన్నారు. రాష్ట్ర ఎన్నికల మాజీ కమిషనర్ నాగిరెడ్డి మాట్లాడుతూ.. మానవ సాంఘిక జీవనానికి విత్తనం మూలధారమన్నారు. గతంలో రైతులే మేలైన విత్తనాలను నిల్వ చేసి, ఇతరులకు పంచి వ్యవసాయం చేసేవారని, అలాంటి విత్తన మేథో సంపత్తి కనుమరుగవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ మాట్లాడుతూ.. విత్తనం మూలం ఇదం జగత్ అనే నినాదాన్ని ప్రాచుర్యంలోకి తేవాలని, ఆకుపచ్చ విప్లవం రావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం రైతు సంక్షేమానికి, అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా 20 అంశాలతో ఐదు భాషల్లో డిక్లరేషన్ ప్రకటించారు. అనంతరం పాలసీ నిపుణుడు దొంతి నర్సింహారెడ్డి రచించిన 'ఆరోగ్యానికి.. ఆహార భద్రతకు విత్తనం' పుస్తకాన్ని విష్కరించారు. కార్యక్రమంలో సీజీఆర్ చైర్ పర్సన్ లీలా లక్ష్మారెడ్డి, ఫౌండర్ లక్ష్మారెడ్డి, సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ దిలీప్‌రెడ్డి, వివిధ రంగాల నిపుణులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

ఆ పార్టీలకు దోచుకోవడమే తెలుసు



పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

- తెలంగాణలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

బడంగ్‌పేట్: తెలంగాణలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు దోచుకోవడం, దాచుకోవడానికే వచ్చాయని.. సేవ చేద్దామని కాదని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి విమర్శించారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం బడంగ్‌పేట్‌లోని కాకతీయ స్కూల్ వద్ద చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డితో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో వచ్చే శాసనసభ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేద్దామన్నారు. ఒక్క రూపాయి అవినీతి లేకుండా 11 ఏళ్లుగా మోదీ దేశాన్ని పరిపాలిస్తున్నారని, ఇంతకంటే ఈ దేశానికి నీతివంతమైన దేశభక్తుడిని ఎవరు తేగలరని ప్రశ్నించారు. నేటి నుంచి అంబేడ్కర్ జయంతి వరకు ప్రతి కార్యకర్త ఇంటిపై పార్టీ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజుభూపాల్‌గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములుయాదవ్, పార్టీ అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పుష్పక్ బస్సుల్లో రూట్‌పాస్‌లు

సాక్షి, సిటీబ్యూరో: ఆర్టీసీ పుష్పక్ బస్సుల్లో రూట్‌పాస్‌లను అందుబాటులోకి తెచ్చింది. నగరంలో ఎక్కడి నుంచైనా ఎయిర్‌పోర్టుకు రాకపోకలు సాగించేందుకు నెలవారీ పాస్‌లు ఉన్నాయి. అలాగే కొన్ని నిర్దిష్టమైన మార్గాల్లో మాత్రమే ప్రయాణం చేసేందుకు రూట్ పాస్‌లు దోహదం చేస్తాయి. ఎయిర్ పోర్ట్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో పని చేసే ఉద్యోగులు వినియోగించుకోవచ్చు. ప్రస్తుతం వివిధ ప్రాంతాల నుంచి ప్రతిరోజూ 53 పుష్పక్ ఏసీ బస్సులు నడుస్తున్నాయి. 24 గంటల పాటు ఇవి అందుబాటులో ఉంటాయి. ప్రయాణికుల కోసం ఆర్టీసీ ఎంతో ప్రతిష్టాత్మకంగా పుష్పక్‌లను నడుపుతున్నప్పటికీ ఆదరణ తక్కువగానే ఉంది. దీంతో వివిధ మార్గాల్లో ఆదాయం పెంచుకొనేందుకు ప్రణాళికలు రూపొందిస్తోంది. ఇందులో భాగంగా రూట్ పాస్‌లను అందుబాటులోకి తెచ్చింది. నగరంలో ఎక్కడి నుంచైనా ఎయిర్‌పోర్టుకు రాకపోకలు సాగించేందుకు నెలవారీ పాస్ రూ.5,260, శంషాబాద్ నుంచి ఎయిర్‌పోర్టు వరకు రూ.2,110, ఆరాంఘర్, బాలాపూర్ నుంచి ఎయిర్‌పోర్టుకు రూ.3,160, ఎల్‌బీనగర్, గచ్చిబౌలి నుంచి ఎయిర్‌పోర్టుకు రూ.4,210.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



ఎంపీ మల్లు రవిని సన్మానిస్తున్న నాయకులు

కడ్తాల్: సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఆదివారం ఉదయం నాగర్‌కర్నూల్ జిల్లా శిరసనగండ్లకు వెళ్తూ మండల కేంద్రంలో కాసేపు ఆగారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. రేవంత్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టాక 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడం జరిగిందన్నారు. ప్రతిపక్షాలు లేనిపోని అసత్య ప్రచారాలు చేస్తున్నాయని, వాటిని తిప్పికొట్టాలని సూచించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ చైర్ పర్సన్ యాటగీత, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు బాలరాజు, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, సేవాలాల్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్పతినాయక్ పాల్గొన్నారు.

ఆమనగల్లులో ఘనస్వాగతం

ఆమనగల్లు: నాగర్‌కర్నూల్ ఎంపీ డా.మల్లురవికి ఆమనగల్లు పట్టణంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో మార్కెట్ మాజీ వైస్‌చైర్మన్ గుర్రం కేశవులు, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు మండ్లి రాములు తదితరులు పాల్గొన్నారు.

నారాయణ సంస్థాన్ సేవలు అభినందనీయం



స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు జ్ఞాపిక అందజేసిన ట్రస్ట్ ప్రతినిధులు

సైదాబాద్: నిరుపేద దివ్యాంగులకు నారాయణ సేవా సంస్థాన్ అందిస్తున్న సేవలు అభినంద నీయమని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. మినర్వా ఫంక్షన్‌హాల్‌లో నారా యణ సేవా సంస్థాన్ ఆధ్వర్యంలో ఉచిత ఆపరేష న్‌ల కోసం ఎంపిక, దివ్యాంగులకు అందజేసే ఆర్టిఫి షియల్ ఉపకరణాల కోసం కొలతల శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న స్పీకర్ మాట్లాడుతూ.. పుట్టుకతో దివ్యాం గులు, అనారోగ్య కారణాలు, ప్రమాదాలతో దివ్యాంగులుగా మారిన వారిని ఈ శిబిరంలో చూస్తుంటే తన మనసు ఎంతగానో కలచివేసింద న్నారు. ఈ శిబిరంలో 1200 మంది దివ్యాంగులు తమ వివరాలు నమోదు చేసుకున్నారని, వారికి రెం డు నెలల్లో నాణ్యతతో కూడిన మాడ్యులర్ కృత్రిమ అవయవాలను అందిస్తామని నిర్వాహకులు తెలి పారు. ఈ కార్యక్రమంలో సంస్థాన్ డైరెక్టర్ వందన అగర్వాల్, దేవేంద్ర చౌబీసా, ట్రస్టీ ప్రభాకర్, భగ వాన్ ప్రసాద్‌గౌడ్, హరిప్రసాద్ పాల్గొన్నారు.

ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య



యమున (ఫైల్)

చేవెళ్ల: వివాహిత ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరి ధిలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. చేవెళ్ల హౌసింగ్ బోర్డు కాలనీలో ఉండే గోవిందగారి పురుషో త్తంరెడ్డికి రెండేళ్ల క్రితం హైదరాబాద్‌లోని కాళీ మందిర్‌కు చెందిన తరుణి అలియాస్ యము న(30)తో వివాహ జరిగింది. కొన్నేళ్ల పాటు వారిద్దరూ అన్యోన్యంగా ఉన్నారు. అనుకోకుం డా శనివారం రాత్రి భర్త ఇంట్లో లేని సమయం లో ఆమె గదిలో గడియ పెట్టుకొని ఉరి వేసు కొని ఆత్మహత్య చేసుకుంది. ఎంత పిలిచినా బయటకు రాకపోవటంతో కుటుంబసభ్యులు తలుపు తెరిచి చూడగా విగత జీవిగా కనిపిం చింది. దీనిపై మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. ఆత్మహ త్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

యువతి అదృశ్యం



నిహారిక

నాగోలు: ఇంట్లో నుండి బయటకు వెళ్లిన ఓ యువతి అదృశ్యమైన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివ రాల ప్రకారం..బండ్లగూడ ఇందు అరణ్య అపార్ట్ మెంట్‌లో నివాసముండే సంకేపల్లి నిహారిక(28) ప్రైవేట్ ఉద్యోగం చేస్తుంది. ఈ నెల5న ఇంట్లో ఎవ రికి చెప్పకుండా బయటకు వెళ్లి రాత్రైనా రాలేదు. కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. స్నేహితులు, బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో ఆదివారం తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

భూమి దక్కదనే కక్షతోనే..

సుపారీ ఇచ్చి హత్య చేయించిన దాయాదులు

- కారు ఢీకొట్టి మృతి చెందిన కేసును ఛేదించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన సీఐ వెంకటేశ్వర్లు



నిందితులను చూపుతున్న పోలీసులు

మహేశ్వరం: భూమిపై అత్యాశే ప్రాణాలు తీసింది. ఐదెకరాల పొలం తమకు దక్కదనే కక్షతో దాయా దిని సుపారీ ఇచ్చి కారుతో ఢీకొట్టి హత్య చేయిం చారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి చనిపో యిన కేసును పోలీసులు ఛేదించారు. ఈ మేరకు మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు ఆదివారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మండలం లోని కల్వకోల్ గ్రామానికి చెందిన గూడెపు శంకర య్య(60)కు తన దాయాదులైన గూడెపు నర్సిం గ్‌రావు, గూడెపు కుమార్, గూడెపు శ్రీనివాస్‌లతో తండ్రుల కాలం నుంచి భూ తగాదాలున్నాయి. ప్రస్తుతం అవి కోర్టులో నలుగుతున్నాయి. ఇటీవల శంకరయ్యకు అనుకూలంగా ఐదు ఎకరాల భూమిపై ఇంజెక్షన్ ఆర్డర్ వచ్చింది. దీంతో వివాదా స్పదమైన భూమిలోకి వెళ్లేందుకు ఆయన ప్రయతి ్నంచారు. ఇది రుచించని దాయాదులు ఎలాగైన ఆయన్ని మట్టుబెట్టాలని పథక రచన చేశారు. ఇం దుకు అదే గ్రామానికి చెందిన కొండని ప్రశాంత్‌ను ఎంపిక చేసుకున్నారు. తనకున్న రూ.12 లక్షల అప్పు తీర్చడంతో పాటు ఇల్లు నిర్మిస్తామని ఒప్పం దం కుదుర్చుకున్నారు. ఈ క్రమంలో ఈ నెల 2న మధ్యాహ్నం బైక్‌పై శంకరయ్య వెళుతుండగా ప్రశాంత్ కారులో వెనుక నుంచి ఢీకొట్టి హత్య చేశాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని సీసీ ఫుటేజ్, కాల్‌డాటా ఇతర వివరాలపై దర్యాప్తు ప్రారంభిం చారు. ముందుగానే పోలీసులు కారు డ్రైవర్ ప్రశాం త్‌ను అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారించగా వాస్తవాలు చెప్పాడు. ఈ మేరకు నిం దితులు గూడెపు నర్సింగ్‌రావు, బక్కని కార్తీక్(న ర్సింగ్ రావు బామ్మర్ది), గూడెపు కుమార్, గూడెపు శ్రీనివాస్‌లను అరెస్టు చేశారు. హత్య కేసును ఛేదిం చిన మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ మధుసూదన్, క్రైమ్ కానిస్టేబుళ్లను డీసీపీ సునీ తారెడ్డి, ఏసీపీ లక్ష్మీకాంత్‌రెడ్డి అభినందించారు.

వేసవి దుక్కులు.. రైతుకు లాభాలు

- పొలంలో చీడపీడల నివారణకు ఉపయోగం
- లోతు దుక్కులతో పెరగనున్న భూసారం



మద్దూర్‌లో ట్రాక్టర్‌తో దుక్కులు దున్నుతున్న రైతు



మక్తగూడలో కాడెద్దులతో దున్నుతున్న రైతు (ఫైల్)

షాబాద్: తొలకరి ప్రారంభానికి ముందే రైతులు పొలం పనులకు సమాయత్తం కావాలి. అందుకు వేసవిని అనుకూలంగా మలుచుకోవాలి. ఎండా కాలం చేపట్టాల్సిన దుక్కుల పనులను షాబాద్ మండల వ్యవసాయ అధికారి వెంకటేశం వివరిం చారు. గతంలో ప్రతి రైతు ఎద్దులు, ఆవులు, గేదెలను రాత్రుళ్లు పొలంలో కట్టేసేవారు. వాటి మలమూత్రాలు పొలానికి చేరి పంటలకు ఉప యోగపడేవి. ఇందువల్ల ఎరువులు ఖర్చు తగ్గేది. ఇప్పుడు పశుపోషణ తగ్గిపోయింది. సేంద్రియ ఎరువు అందించడంతో ఉత్పత్తులను లాభసా టిగా సాధించవచ్చు. ప్రస్తుతం తుంగ, గరిక వం టి మొండిజాతి కలుపు మొక్కలు పొలంలో పెరిగి పంటలకు నష్టం కలుగజేస్తుంటాయి.

తెగుళ్లు రాకుండా..

ఇటీవల మండలంలోని వివిధ ప్రాంతాల్లో అకాల వర్షాలు కురిశాయి. ప్రస్తుతం దుక్కులు చేసుకోవ డానికి సరిపడా తేమ ఉన్న పొలాల్లో ట్రాక్టర్లు లేదా ఎద్దుల నాగళ్లతో లోతుగా దుక్కులు దున్నాలి. ఇవి సుమారుగా 9 అంగుళాలకు తగ్గకుండా ఉండాలి. అలా లోతు దుక్కులు వేసవిలో చేసినప్పుడు పలు రకాల ప్రయోజనాలు చేకూరుతాయి. నేలలో ఉం డే పురుగులు తెగుళ్లను నశింపజేసే అవకాశం ఉం ది. అందువల్ల వేసవిలో పంట కోతలు పూర్తయిన వెంటనే పొలాలను ఎద్దులతో లాగే పరికరాలతో లోతు దుక్కి చేసుకుంటే తొలకరిలో ఉపయోగక రంగా ఉంటుంది.

వేర్లు విస్తరించేందుకు అవకాశం

వేసవిలో లోతుగా దుక్కి దున్ని తొలకరి వర్షాలకు గొర్రు తిప్పి సేద్యం చేస్తే వేర్లు బాగా విస్తరించడా నికి అనుకూలంగా ఉంటుంది. నేల అధికంగా నీటిని పీల్చుకుంటుంది. సేద్యానికి ఉపయోగించే గొర్రు, గుంటుక, దతెల వంటి పరికరాలు నెల లోపలికి 3–4 అంగుళాల లోతు వరకు చొచ్చుకు పోతాయి. ఈ పరికరాలను ఉపయోగించి పదే పదే సేద్యం చేయడంతో నేల లోపల సుమారుగా 3–5 అంగుళాల లోతులో ఒకగట్టి పొర ఏర్పడు తుంది. దీంతో నేలకు నీటిని పీల్చుకునే శక్తి తగ్గుతుంది.

సేంద్రియ పదార్థం కలుస్తుంది

పంటకోత తర్వాత నేలపై మిగిలే పంట మొదళ్లు పొలంలో మిగిలిన కలుపు మొక్కలు, పంటల నుంచి రాలిపడిన ఆకుల వంటి లోతు దుక్కి దున్నినప్పుడు కుళ్లిపోతాయి. దీంతో సేంద్రియ పదార్థాలు పెరగడానికి అవకాశం ఉంది. సంవ త్సరం పొడవునా నిలువ చేసిన పశువుల ఎరువు లను ఎండా కాలంలోనే పొలాల్లోకి తోలాలి. వర్షాలు పడిన తర్వాత నేలపై చల్లి లోతు దుక్కి దున్నితే మట్టిలో బాగా కలుస్తుంది.

అవగాహన కల్పించాలి



గ్రామాల్లో దుక్కులపై రైతులకు అధికారులు మరింతగా అవగాహన కల్పించాలి. వ్యవసాయ అధికారులు సమావేశా లప్పుడే కాకుండా మిగతా సమయంలో కూడా రైతులను క్షేత్రస్థాయిలో చైతన్య పరచాల్సిన అవసరం ఉంది. మేకల ఎరువు సైతం దొరకని పరిస్థితి దాపురించింది.

– విఠలయ్య, రైతు, తిర్మలాపూర్

దుక్కులు దున్నుకోవాలి



వేసవిలో దుక్కులు దున్నుకోవడంతో రైతులకు వర్షాకాలంలో మంచి ఫలితాలు వస్తాయి. లోతుగా దున్నుకునేందుకు కృషి చేయాలి. సేం ద్రియ ఎరువులను ఉపయోగించాలి. వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాలి.

– వెంకటేశం, ఏఓ షాబాద్

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టే షన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం లభ్యమైంది. ఎస్ఐ పైడినాయుడు సమాచారం మేరకు... ఈ నెల 4వ తేదీన ఉందాసాగర్ చెరువులో గుర్తు తెలియని వ్యక్తి పడి ఉన్నాడని సమాచారం అందింది. సంఘ టన స్థలానికి వెళ్లి పరిశీలించగా 30–35 సం వత్సరాల వ్యక్తి చనిపోయి ఉన్నాడు. శరీరం గుర్తుపట్టడానికి వీలు లేకుండా కుళ్లిపోయి ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

మైలార్‌దేవ్‌పల్లి: భార్యాభర్తల మధ్య గొడవల కారణంగా ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టే షన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... శాస్త్రీపురం కింగ్స్ కాల నీకి చెందిన అబ్దుల్ వహీద్(40) భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి ఉంటున్నాడు. మద్యానికి బానిసై కుటుంబాన్ని సరిగా చూసుకోవడం లేదు. ఈ విషయమై తరచూ భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 2వ తేదీన సైతం గొడవ జరగడంతో భార్య పిల్లలను తీసుకొని పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన అబ్దుల్ వాహిద్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చుట్టు పక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటన స్థలానికి చేరుకొని మృతదే హాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పు డబ్బులు అడిగినందుకు అంతమొందించాడు

- సికింద్రాబాద్ బోయిగూడలో వ్యక్తి దారుణ హత్య
- మృతదేహాన్ని నీటి సంపులో వేసి నిందితుడి పరార్

బన్సీలాల్‌పేట్: అప్పు డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగినందుకు ఓ వ్యక్తి దారుణ హత్యకు గుర య్యాడు. సికింద్రాబాద్‌లోని బోయిగూడలో జరి గిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం వివ రాలు ఇలా ఉన్నాయి.. అల్వాల్ ప్రాంతానికి చెం దిన ఫైనాన్స్ వ్యాపారి సత్‌నమ్ సింగ్ భాటియా (59) ఫైనాన్స్ వ్యాపారం చేస్తుండేవాడు. బోయి గూడలో టీ కొట్టు నడుపుతున్న నవీన్ (31)కు ఆయన రూ.లక్ష అప్పు ఇచ్చాడు. చాలా రోజు లుగా నవీన్ అప్పు డబ్బులు ఇవ్వకుండా సత్‌నమ్ సింగ్‌ను తిప్పించుకుంటున్నాడు. టీ కొట్టు కూడా మూసివేసి తప్పించుకు తిరుగుతున్నాడు. నవీన్ ఇంటి అడ్రస్‌ను తెలుసుకొన్న సత్‌నమ్ సింగ్ ఇటీ వల బోయిగూడలోని నిందితుడి ఇంటికి వచ్చిపో తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 4న రాత్రి నవీన్ మాట్లాడుకుందామంటూ సత్‌నమ్ సింగ్ భాటి యాను ఇంటికి తీసుకెళ్లాడు. ఇద్దరూ కలిసి ఇం ట్లోకి వెళ్లారు. వీరి మధ్య డబ్బుల విషయమై ఘర్షణ జరిగింది. దీంతో నవీన్ సత్‌నమ్ సింగ్‌ను పలు చోట్ల కత్తితో దాడి చేసి దారుణంగా హత్య చేశాడు. అనంతరం ఇంటిలోని నీటి సంపులో మృ తదేహాన్ని పడేసి సత్‌నమ్ సింగ్ ద్విచక్ర వాహనాన్ని తీసుకొని పరారయ్యాడు. గాంధీనగర్ పోలీసు స్టేషన్ పరిధిలో మర్డర్ జరగగా.. అల్వాల్ పీఎస్‌లో జీరో ఎఫ్ఐఆర్, ముషీరాబాద్ ఠాణాలో ఎఫ్ఐఆర్ నమోదైంది. మూడు పోలీసు స్టేషన్ల పరిధిలో ముడిపడిన ఈ కేసు వివరాలను ఏ ఒక్క పోలీసు స్టేషన్ అధికారి ఆదివారం రాత్రి వరకూ వివరాలు వెల్లడించకపోవడం గమనార్హం.

సెల్‌ఫోన్ ఆధారంగా ..

హత్యకు ముందు.. సత్‌నమ్ సింగ్ భాటియా తన ఫోన్‌లో బ్యాలెన్స్ లేకపోవడంతో బోయిగూడ ప్రాంతంలోని ఓ వ్యక్తి వద్ద సెల్‌ఫోన్ తీసుకొని కుటుంబ సభ్యులకు కాల్ చేశారు. మరుసటి రోజు వరకు అతను ఇంటికి రాకపోవడంతో కుటుంబీ కులు అల్వాల్, ముషీరాబాద్ పోలీసు స్టేషన్‌లలో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. పోలీసులు సెల్ ఫోన్ ఆధారంగా బోయిగూడ ప్రాంతానికి వచ్చి వాకబు చేశారు. హతుడి సెల్‌ఫోన్ సిగ్నల్ బోయిగూడలోనే చూపించడంతో సీసీ కెమెరాలను పరిశీలించారు. సత్‌నమ్ సింగ్ కుటుంబీకులు, పోలీసులు శనివారం రాత్రి బోయిగూడకు వచ్చి నవీన్ ఇంటి తలుపులు బద్దలు కొట్టి లోనికి వెళ్లారు. ఎక్కడా మృతుడి ఆచూకీ.. ఆనవాళ్లు కని పించలేదు. చివరి ప్రయత్నంగా నీటి సంపును తెరిచి చూడగా.. సత్‌నమ్ సింగ్ భాటియా మృత దేహం కనిపించింది. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ కేసును ముషీరాబాద్ పోలీసులు చూడాలా? గాంధీనగర్ పోలీసులు చూడాలా? అనేది ప్రశ్నగా మారింది. దీంతో ఎవరూ ఈ కేసుకు సంబంధించిన సమా చారం ఇవ్వడానికి ముందుకు రాకపోవడం గమ నార్హం.

ఒడిశా నుంచి వచ్చి..

ఒడిశా నుంచి బతుకుదెరువు కోసం నగరానికి వచి ్చన నవీన్.. భార్య, కుమారుడితో కలిసి బోయిగూ డలో ఆల్‌ఫత్తా హోటల్ సమీపంలో టీ కొట్టు పెట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. స్థానికంగా అనేక మంది వద్ద ఫైనాన్స్ తీసుకున్నట్లు సమా చారం. అప్పుల వాళ్లకు డబ్బులు చెల్లించలేక ముఖం చాటేసి తప్పించుకుంటున్నాడు. అదే విధంగా క్రికెట్ బెట్టింగ్ ఇతరత్రా జూదాల్లో డబ్బులు పోగొట్టుకున్నట్లు సమాచారం. కుమారు డిని, గర్భవతి అయిన భార్యను ఒడిశాకు పంపిం చి నవీన్ ఒక్కడే బోయిగూడలో ఉంటున్నాడు. ఈ క్రమంలోనే అప్పులు చేసి సత్‌నమ్ సింగ్ భాటియాను హతమార్చి పరారైటనట్లు సమాచారం.

బెల్టు షాపు నిర్వాహకుడి అరెస్టు

రాజేంద్రనగర్: బెల్టు షాపుపై ఎస్ఓటీ పోలీసులు దాడి చేసి మద్యంతో పాటు ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకొని రాజేంద్రనగర్ పోలీసులకు అప్పగించారు. పోలీసుల సమాచారం మేరకు... బండ్లగూడ మల్లికార్జున్‌నగర్ ప్రాంతానికి చెందిన కె.వెంకటేశ్ కిరణాషాపు నిర్వహిస్తున్నాడు. కొన్ని రోజులుగా షాపులోనే మద్యాన్ని తీసుకొచ్చి విక్రయిస్తున్నాడు. ఆదివారం డ్రైడే కావడంతో మద్యాన్ని విక్రయిస్తున్నాడు. దీనిపై సమాచారం అందుకున్న ఎస్ఓటీ పోలీసులు దుకాణంపై దాడి చేసి వెంకటేశ్‌ను అదుపులోకి తీసుకొని రాజేంద్రన గర్ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు నిందితుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేసు కొని దర్యాప్తు చేస్తున్నారు.

బియ్యం పంపిణీ



బియ్యం పంపిణీ చేస్తున్న రాము

మన్సూరాబాద్: దేశంలో టెక్నాలజీ పెరుగు తున్నా పేదల ఆకలిని తీర్చలేకపోవడం అత్యంత బాధాకరమని రైస్ ఎటీఎం నిర్వా హకుడు, సామాజిక కార్యకర్త దోసపాటి రాము ఆవేదన వ్యక్తం చేశారు. నాగోలు డివిజన్ పరిధి రాక్‌హిల్స్‌కాలనీలోని రైస్ ఎటీఎం వద్ద ఆదివారం ఆయన పేదలకు ఉచితంగా బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ.. అర్హులైన పేద లకు గుర్తించి కొత్త రేషన్ కార్డులు అందజేసి బియ్యాన్ని పంపిణీ చేయాలన్నారు. టెక్నాలజీని ఉపయోగించి అర్హులైన పేదలను గుర్తించడంలో పాలకులు అశ్రద్ధ వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు అవసరం



ఎస్ఎంగూడలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న భాస్కర్‌గౌడ్

అత్తాపూర్: వేసవిలో ఎండలు ముదురుతున్న నేప థ్యంలో పాదచారులు, వాహనదారుల దాహార్తిని తీర్చేందుకు స్వచ్ఛంద సంస్థలు చలివేంద్రాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్ అన్నారు. అత్తాపూర్ డివిజన్‌లోని ఎస్ ఎంగూడ చౌరస్తాలో బోయ రమేష్, టి.గురుల ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. చలివేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం వారు మాట్లాడుతూ... మండుతున్న ఎండల నుంచి ప్రజలు ఉపశమనం పొందేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. ప్రజలు వీటిని ఉపయోగించుకోవాలని సూచించారు. స్థానిక నేతలు సర్దార్ హర్మిందర్‌సింగ్, నాగరాజు, రవీంద ర్‌గౌడ్, రమాదేవి, యాదయ్య, ఫరూఖ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

మణికొండ: వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చేం దుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతా యని, వాటిని విరివిగా ఏర్పాటు చేయాలని భారత్ వికాస్ పరిషత్ మణికొండ శాఖ అధ్యక్షుడు, ఎంప్లా యీస్ కాలనీ సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు ఎం.పెంటారెడ్డి అన్నారు. నవ సేవా సంకల్ప ట్రస్ట్ వారు భాగ్యలక్ష్మి కాలనీ దుర్గామాత దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నీటి దానంతో ఎంతో పుణ్యం వస్తుందన్నారు. మానవసేవే మాధవ సేవగా గుర్తించి తమకు తోచిన విధంగా సహాయ కార్యక్ర మాలను నిర్వహించాలన్నారు.

గూబ గుయ్!



- మోటారు హారన్ మోతలతో చెవులకు చిల్లు
- నగరంలో మితిమీరిన శబ్ద కాలుష్యం
- గచ్చిబౌలి- జీడిమెట్ల- ఉప్పల్ తదితర ప్రాంతాల్లో ప్రమాదకర స్థాయిలో..
- వాహనాలకు స్పెషల్ సైలెన్సర్లు బిగిస్తున్న యజమానులు
- కొన్ని హాట్ స్పాట్లలో 110 డెసిబుల్స్ నమోదు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో వాహనాల మోత దడ పుట్టిస్తోంది. అవసరం లేకున్నా మోగిస్తున్న హారన్‌లతో రహదారులు దద్దరిల్లిపోతున్నాయి. గచ్చిబౌలి, జీడిమెట్ల, ఉప్పల్, ఫలక్‌నుమా, హుస్సేన్‌సాగర్ తదితర ప్రాంతాల్లో ప్రమాద కర స్థాయిలో శబ్దాలు నమోదవుతున్నాయి. కొన్ని హాట్ స్పాట్‌లలో 110 డెసిబుల్స్ నమోదు కావడం ఆందోళనకు గురి చేస్తోంది. దీని ప్రభావం వినికిడి శక్తి, మానసిక ఆరోగ్యం పై తీవ్ర ప్రభావం చూపిస్తోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

మధ్యాహ్నం 3.30 నుంచి రాత్రి 8 గంటల మధ్య..

కాలుష్య నియంత్రణ మండలి నిబంధనల ప్రకారం.. నగరంలో వివిధ ప్రాంతాలను బట్టి శబ్ద తీవ్రత 45 నుంచి గరిష్టంగా 65 డెసిబుల్స్ మధ్య ఉండాలి. అయితే.. జూబ్లీహిల్స్, అబిడ్స్, తార్నాక, గచ్చిబౌలి, జూపార్క్, ఫలక్‌నుమా, ఉప్పల్, హుస్సేన్‌సాగర్, సనత్‌నగర్, జీడిమెట్ల, గడ్డపోతారం తదితర ప్రాంతాల్లో సాయంత్రం వేళల్లో 100 డెసిబుల్స్ మించిపోతోందని నివేది కలు స్పష్టం చేస్తున్నాయి. గచ్చిబౌలి- ఉప్పల్ దారిలో మధ్యాహ్నం 3.30 నుంచి రాత్రి 8 గం టల మధ్య 110 డీబీ శబ్దం నమోదవుతోంది. మోటారు వాహన చట్టం ప్రకారం అనవసరం గా హారన్ మోగించడం నిషేధం.

- సిటీ పరిధిలో మోటారు సైకిల్, కారు, ఆటో, బస్సు, లారీ, ఇతర ప్రైవేటు వాహనాలకు భారీ శబ్దాలు వచ్చే హారన్, సైలెన్సర్లు బిగిస్తు న్నారు. పోలీసులు అప్పుడప్పుడు స్పెషల్ డ్రైవ్‌లో మోటారు సైకిళ్ల సైలెన్సర్లపై చలానాలు విధిస్తున్నారు. మిగతా హెవీ వెహికిల్స్‌పై మాత్రం దృష్టి పెట్టడం లేదు. నగరం నుంచి ఆంధ్రప్రదేశ్, తమిళ నాడు, మహారాష్ట్ర, కర్ణాటక, ఒడిశా తదితర ప్రాంతాలకు వెళ్లే ట్రావెల్ బస్సులు భారీ శబ్దాలు వచ్చే హారన్‌లతో సాయంత్రం వేళల్లో మోత మోగిస్తున్నాయి. గతంలో ఒక దఫా ఆర్టీసీ బస్సులపై కేసులు నమోదు చేసిన అధికారులు తదుపరి తనిఖీలను మాత్రం విస్మరించారు.

ఆటోమేటిక్ చలానా సిస్టం..

నగరంలో శబ్ద కాలుష్యాన్ని సమర్థంగా ఎదుర్కోవడానికి ట్రాఫిక్ పోలీసులు 2020లో సిగ్నళ్ల వద్ద అకౌస్టిక్ కెమెరాలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఫలితంగా సిగ్నల్ దగ్గర పరిమితికి మించి ఎవరైనా హారన్ మోగిం చినా, ఇంకా ఏ ఇతర కారణాలతోనైనా నిర్దేశిత ప్రమాణాల కంటే ఎక్కువ శబ్దం చేస్తే ఈ మీటర్ ఆటోమేటిక్‌గా ఫొటో తీసి, చలానా వేస్తుంది. అప్పట్లో కోవిడ్ ప్రభావంతో ఇది ప్రతిపాదనలకే పరిమితమైంది.

కర్ణభేరి పగిలితే కష్టమే..

పరిమితికి మించి శబ్దం చేయడం వల్ల వినికిడి లోపం వస్తుంది. 20 డీబీ వకు సేఫ్. నగరంలో సుమారు 70 డీబీ నమోదవుతోంది. ఇది కొంత ప్రమాదకరమే. కళ్లు తిరగడం, ట్యూమర్ వం టివి వచ్చే అవకాశం ఉంది. పనిలో ఏకాగ్రత దెబ్బ తింటుంది. చెవిలోని కర్ణభేరి పగిలితే మళ్లీ దాన్ని పునరుద్ధరించలేం.

– భూపేందర్ రాథోడ్, ప్రొఫెసర్, ఈఎన్‌టీ హెచ్ ఓడీ, గాంధీ ఆసుపత్రి

హారన్‌ను వీడితే 50 శాతం ధ్వని కాలుష్యం తగ్గుతుంది..

2017 మోటారు వెహికిల్ చట్టం ప్రకారం ప్రమాదమనిపిస్తే తప్ప డ్రైవర్ హారన్ మోగించ రాదు. దీన్ని ఎవరూ పాటించడంలేదు. హార న్‌కు బదులు బ్రేక్ వినియోగించాలి. హారన్ వినియోగించకపోతే సుమారు 50 శాతం సమస్య పరిష్కారమవుతుంది.

– నరేష్ రాఘవన్, రహదారి భద్రత నిపుణులు